# ఆర్టీఐ కింద సమాచారానికి రూ. 15 వేల ఫీజు చెల్లించాలి

## – ఆర్టీఐ దరఖాస్తులో కొంత సమాచారం ఇచ్చేందుకు నిరాకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, (తెలంగాణ దిశ) :**ఆర్టీఐ చట్టం కింద దాఖలైన దరఖాస్తుకు సంబంధించి నో యువర్ రైట్స్ సొసైటీ (ఎన్జీఓ) అధ్యక్షుడు ఎస్. ఉమేష్ కుమార్ కోరిన సమాచారానికిరూ. 15 వేల చెల్లించాలని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్ లాబొరేటరీస్ అండ్ ఫుడ్ (హెల్త్) అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కోరారు. ఈ నెల 10న సమర్పించిన ఆర్టీఐ దరఖాస్తును 12న స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుదారు కోరిన సమాచారంపై విభాగాల వారీగా ప్రత్యుత్తరాలు అందించారు. 2023లో దాఖలైన డబ్ల్యూపి నెంబర్. 10766 కేసుకు పరోక్షంగా సంబంధం ఉన్న సమాచారం కాబట్టి అందించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అలాగే పాయింట్ నంబర్ 2, 3లకు సంబంధించిన సమాచారం విచారణ దశలో ఉన్నందున వెల్లడించలేమని తెలిపారు. అదనంగా ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(ఈ) ప్రకారం వ్యక్తి, అధికార సంస్థ మధ్య విశ్వసనీయ సంబంధం ఉన్న కారణంగా కొంత సమాచారం ఇవ్వలేమని పేర్కొన్నారు. ఇంకా కొన్ని అంశాలకు సంబంధించి ఇప్పటి వరకు ఏ సంస్థకూ సమాచారం వెల్లడించలేదని, ప్రజా డొమైన్‌లోనూ అప్‌లోడ్ చేయలేదని అధికారులు వివరించారు. అధికారిక పత్రాలను పొందేందుకు అనుసరించాల్సిన విధానాన్ని కూడా తెలిపారు. అయితే పాయింట్ నంబర్ 1, 6, 8లకు సంబంధించిన సమాచారానికి అవసరమైన పత్రాల ఫోటో కాపీలు అందించేందుకు రూ.15 వేలు చెల్లించాలని కోరారు. ఈ మొత్తాన్ని నారాయణగూడ, హైదరాబాద్‌లోని డైరెక్టర్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్ లాబొరేటరీస్ అండ్ ఫుడ్ (హెల్త్) అడ్మినిస్ట్రేషన్ పేరుతో చెల్లించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఖర్చు అంచనాకు అనుగుణంగా ఫీజు నిర్ణయించబడినట్లు తెలిపారు. అవసరమైతే అదనపు చెల్లింపుల కోసం మరల సమాచారం జారీ చేయబడుతుందని పేర్కొన్నారు. ఈ ఘటన ఆర్టీఐ చట్టం అమలులో పారదర్శకత, సమాచారం హక్కు పరిరక్షణపై మళ్లీ చర్చకు దారి తీసే అవకాశముంది. ఈ సందర్భంగా ఉమేష్ కుమార్ మాట్లాడుతూ ఆర్‌టీఐ చట్టం ప్రకారం సమాచార ప్రతులకు సాధారణంగా ప్రతి పేజీకి సుమారు రూ. 2 మాత్రమే వసూలు చేయాలన్నారు. అయితే ఎన్ని పేజీలు ఉంటాయి, ఖర్చు లెక్క ఎలా వేశారో వివరాలేమీ ఇవ్వకుండా భారీ మొత్తాన్ని అడగడంలో ఆంతర్యం ఏమిటని ఉమేష్ కుమార్ ప్రశ్నించారు. అడిగిన సమాచారం కోర్టు కేసుకు పరోక్ష సంబంధం ఉందని కారణాన్ని చూపుతూ, సెక్షన్




8(1)(ఈ) కింద మినహాయింపు చూపించారని, ఈ కారణాలు చట్టపరంగా పరిశీలనకు లోబడి ఉంటాయని ఆర్‌టీఐ నిపుణులు పేర్కొంటున్నారు. భారీ మొత్తాన్ని డిమాండ్ చేయడం ప్రజలు సమాచార హక్కును వినియోగించకుండా నిరుత్సాహ పరిచే విధంగా ఉందని ఉమేష్ కుమార్ అన్నారు. ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఉన్నతాధికారులను ఆశ్రయించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఘటన ప్రభుత్వ సంస్థల్లో ఆర్‌టీఐ చట్టం అమలుపై పారదర్శకతపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## దోమల సమస్యను పరిష్కరించాలి



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 23, (తెలంగాణ దిశ)** :నిజాంపేట సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్ డివిజన్ 276 లో దోమల బెడద పరిష్కారానికి తగినచర్యలు తీసుకోవాలని సిపిఎం బాచుపల్లి మండల కమిటీ కార్యదర్శి బి. వెంకటరామయ్య నిజాంపేట సర్కిల్ అధికారులను కోరారు. సోమవారం ఆయన ప్రజావాణి కార్యక్రమంలో ఈ విషయమై వినతిపత్రం సమర్పించారు. స్థానిక చెరువులో గుర్రపు డెక్క పెరిగి దోమల ఉత్పత్తి పెరిగిందని, తద్వారా ప్రగతినగర్ లోని అన్ని కాలనీలలో దోమల విజృంభిస్తున్నాయని వివరించారు. రోజు మార్చి రోజు మున్సిపల్ అధికారులు చేయించాల్సిన ఫాగింగ్ చేయట్లేదని ఆయన వివరించారు. పలు కాలనీలలో డ్రైనేజీ మ్యాన్యువల్ పొంగిపొర్లుతుండడం కారణంగా ఆయా కాలనీలలో స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆయన తెలిపారు. ఈ విషయమై వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాథోడ్ సంతోష్, సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యుడు బాల వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు వెంకటరాజ్యం, బాల పేరు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఈసీఐఎల్ చౌరస్తాలో అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ ఫేస్-2 అవగాహన





**కుషాయిగూడ, ఫిబ్రవరి 23, (తెలంగాణ దిశ)** :తెలంగాణ పోలీస్ శాఖ ఆదేశాల మేరకు అరైవ్ అలైవ్ క్యాంపెయిన్ ఫేస్--2 అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈసీఐఎల్ సర్కిల్ లో హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక అవగాహనకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ పీఎస్ ఎస్సై ఎం. విజయ్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొని ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతపై సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలు ప్రధాన కారణమని, నాణ్యమైన (ఐఎస్ఐ మార్క్) హెల్మెట్ ధరించడం ద్వారా 60 నుంచి 70 శాతం వరకు ప్రాణాపాయం తగ్గించవచ్చని వివరించారు. రైడర్‌తో పాటు పిలియన్ రైడర్ కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన చట్టబద్ధ బాధ్యత ఉందని తెలిపారు.మోటార్ వెహికిల్స్ చట్టం ప్రకారం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. సుమారు60 నుంచి 70 మంది ద్విచక్ర వాహనదారులు మరియు స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హెల్మెట్‌ను సరైన విధంగా ధరించే విధానాన్ని పోలీసులు ప్రత్యక్షంగా ప్రదర్శించారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో హెల్మెట్ వినియోగంపై చైతన్యం పెంపొందించడంతో పాటు రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యమని పోలీసులు తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటం దగ్ధం

### - బిజెపి నాయకులపై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు
### - నాచారం హెచ్ఎంటి కామన్ వద్ద సీఎం చిత్రపటం దహనం ఘటన
### -- పోలీసులకు కాంగ్రెస్ ఫిర్యాదు

**నాచారం, ఫిబ్రవరి 23, (తెలంగాణ దిశ) :**ఉప్పల్, ఫిబ్రవరి 23:అనుముల రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని ఉద్దేశపూర్వకంగా దహనం చేసిన ఘటన ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం డివిజన్‌లో ఉద్రిక్తతకు దారితీసింది. నాచారం హెచ్ఎంటి కామన్ వద్ద బీజేపీ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ఈ చర్యకు పాల్పడ్డారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గద్ద క్రాంతి కిషోర్ ఆధ్వర్యంలో నాచారం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అడ్మిన్ ఎస్ఐ




వెంకటయ్యకు ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కృష్ణరెడ్డి, తుంగ తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, అశ్వత్థామరెడ్డి, బండారి రఘు, సంతోష్ రెడ్డి, ఎస్సీ సెల్ చిలుక నరేష్, ఎన్ఎస్‌యుఐ గౌడెల్లి రాకేష్, యూత్ కాంగ్రెస్ నేత చందన్ యాదవ్, జూపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# ఆర్టీసి ఉద్యోగులను వేధిస్తే ఖబర్దార్

### - శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్

**నల్లగొండ, ఫిబ్రవరి 23, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్రం రావడానికి ప్రధాన కారణమైన ఆర్టీసి ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్న ఆర్టీసీ యాజమాన్యం నిప్పుతో చెలగాటం ఆడుతున్నదని శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం నల్లగొండ చౌరస్తాలో వీర శివాజీ విగ్రహం వద్ద ఆర్టీసి కార్మికులకు మద్దతుగా ఛలో సెక్రెటేరియట్ విజయవంతం చేయాలని దీక్ష చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్ పిఆర్ సీ ఇవ్వకుండా, రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయకుండా పని భారాన్ని పెంచుతున్నారని విమర్శించారు. ఉద్యోగులను వేధిస్తే ఖబర్దార్ అని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని, ఆర్టీసీ యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఆర్టీసి ఉద్యోగులకు సెలవు అడిగితే డిఎంలను కలవాలని, 8 గంటల పనికి 12 గంటలు చేయించుకుంటున్నారని ఆయన విమర్శించారు. డ్రైవర్ల పరిస్థితి ఆరోగ్య సమస్యలను పట్టించుకోకుండా 3 ట్రిప్పులు, 4 ట్రిప్పులని డిఎంలు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇది తెలంగాణ రాష్ట్రం కోసం సకలజనుల సమ్మెలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి యావత్



తెలంగాణ సబ్బండ వర్గాల మద్దతుతో రాష్ట్రం రావడం కోసం కుటుంబాలను త్యాగాలు చేసిన ఆర్టీసి ఉద్యోగులకు అండగా శివసేన పార్టీ మద్దతు ఇస్తుందని అన్నారు. ఈ నెల 24 ఛలో సెక్రటేరియేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పూస శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ లింగాచారి, నవీన్ రెడ్డి, శ్రీశైలం పటేల్, ఊదరి బాలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో బీసీ, ఈబీసీ విద్యార్థుల ఉపకార వేతనాల నిధులు విడుదల

### - జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఝాన్సీరాణి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 23 (తెలంగాణ దిశ)** :జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ విద్యార్థుల ఉపకార వేతనాల మంజూరీ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి. ఝాన్సీరాణి తెలిపారు. ఈ నేపథ్యంలో ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థుల అప్లికేషన్ ఫారాలకు సంబంధించిన అవసరమైన ధృవీకరణ పత్రాలను జత చేసి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయం, మేడ్చల్ మల్కాజిగిరి వద్ద సమర్పించాలని కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను ఆమె కోరారు. అదే విధంగా పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ పథకం కింద నమోదు చేసుకున్న విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ నంబర్ సీడింగ్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. స్కాలర్ షిప్ మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా జమ చేయనున్నందున విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్, డిబిడి యాక్టివేషన్ పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులు తమ




బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయుటకు సంబంధిత బ్యాంక్ బ్రాంచ్‌ను సంప్రదించవచ్చు లేదా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ పీసీఐ) అధికారిక వెబ్‌సైట్ ఎన్ పీసీఐ ద్వారా కూడా సీడింగ్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్, ఇంజినీరింగ్, ఇతర కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ కళాశాలల బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఈ విషయమై అవగాహన కల్పించి, వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి టి. ఝాన్సీ రాణి కోరారు.

# కన్నుల పండువగా ప్రశాంతి హిల్స్ కాలనీలో దేవతా విగ్రహాల ప్రాణ ప్రతిష్ట



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 23, (తెలంగాణ దిశ)** :ప్రగతి నగర్ డివిజన్ పరిధిలోని ప్రశాంతి హిల్స్ కాలనీలో సోమవారం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ ఉమామహేశ్వర స్వామి, శ్రీ మహా సరస్వతి అమ్మవారు, భక్త ఆంజనేయ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రతిష్ట, కలశ స్థాపన మహోత్సవం కూడా వైభవంగా జరిగింది. సాయంత్రం శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా భక్తులు నిర్వహించారు. ఈ మహోత్సవానికి చుట్టుపక్కల కాలనీల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, నిజాంపేట మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, ప్రణయ్ ధనరాజ్, కొలను చంద్రశేఖర్ రెడ్డి, వేషాల ధనుంజయ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి, చంద్రమౌళి, డాక్టర్ రాజు, పద్మ ప్రసాద్, బిక్షపతి యాదవ్, ప్రసాద్ రాజు, నరేంద్ర చౌదరి, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



# కాప్రా ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ ఏర్పాటు

### - జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా
### - నూతన అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి

కాప్రా, ఫిబ్రవరి 23, (తెలంగాణ దిశ) :కాప్రా ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని సోమవారం టిఎస్ఐఐసి కాలనీలోని కాప్రా ప్రెస్ క్లబ్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా రోండ్ల ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గాదె రాము గుప్త, కోశాధికారిగా నమ్ముల రమేష్ యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా అమరేందర్, సత్యం, ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, బసంత్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా నటరాజ్, దాచారం రమేష్, గౌరవ అధ్యక్షులుగా రామారం సుధీర్ గౌడ్, గుండ్ల గోపాల్ గౌడ్, ప్రధాన సలహాదారులుగా శనిగరం అశోక్ , నరసింహారెడ్డిలు, కార్య నిర్వాహక సభ్యులుగా మైసయ్య గౌడ్, రమేష్ గౌడ్, ప్రసాద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ



తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాతోటి మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలతో పాటు ప్రతి జర్నలిస్టులకు ఎలాంటి వడిదుడులు ఎదురైనా ముందుండి పోరాటం చేస్తానని తెలిపారు. అంతే కాకుండా కాప్రా ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# సీఎం కప్ సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల విజేత మేడ్చల్ జిల్లా

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, (తెలంగాణ దిశ) :**గచ్చిబౌలిలో నిర్వహించిన సీఎం కప్--2025 స్టేట్ లెవెల్ సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో మేడ్చల్ జిల్లా జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు జిల్లాల జట్లు పోటీ పడ్డాయి. మేడ్చల్ జిల్లా జట్టు ఆటగాళ్లు ప్రారంభం నుంచే దూకుడుగా ఆడి ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం ప్రదర్శించారు. సమన్వయం, వేగం, క్రమశిక్షణతో కూడిన ఆట తీరుతో ఫైనల్ మ్యాచ్‌లో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. జట్టు కోచ్‌ల వ్యూహాలు, ఆటగాళ్ల పట్టుదల విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయి. విజేత జట్టును అధికారులు, కోచ్‌లు, క్రీడా ప్రియులు అభినందించారు.



భవిష్యత్తులో రాష్ట్రం తరపున జాతీయ స్థాయి పోటీల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

